క్లుప్తంగా

వీరభద్రుపేటలో గిరినాగు పట్టివేత



గిరి నాగును పట్టుకుంటున్న వెంకటేశ్

చీడికాడ: మండలంలో వీరభద్రుపేట గ్రామంలో కల్యాణ మండపం చుట్టూ ఒక ఫంక్షన్ నిమిత్తం రైతులు తుప్పలు, డొంకలు గురువారం కొడుతుండగా 13 అడుగుల గిరినాగు కనపడింది. దీంతో రైతులు పరుగులు తీసారు. స్థానికులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్నేక్ క్యాచర్ వెంకటేశ్, వారి బృందం గంట సేపు శ్రమించి, గిరినాగును పట్టి బంధించారు. దూరంగా వున్న రిజర్వు ఫారెస్టులో వదిలిపెట్టారు.

ఘనంగా మరిడి మహాలక్ష్మి పండగ

నాతవరం : మండలంలో పలు గ్రామాల్లో మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండగను గురువారం ఘనంగా జరిపారు. వై.బి.పట్నం, నాతవరం, వలసంపేట, వీబీ అగ్రహారం గ్రామాల్లో గల అమ్మవారి ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు గ్రామ సభల నిర్వహణ

మాడుగుల రూరల్ : మండలంలో 29 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు ఏర్పాటు చేయాలని, స్థానిక ఇన్‌ఛార్జి ఎంపీడీవో జి.వి.ఎస్.గోపాలరావు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద రానున్న ఐదేళ్ల వ్యవధిలో గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై గ్రామ సభల్లో చర్చించి ఆమోదించడం జరుగుతుందని తెలిపారు.

గొలుగొండ : మండలంలో శుక్రవారం జాతీయ ఉపాధి హామీ పథకంపై గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ రాధిక తెలిపారు. కూలీల పనులు, రోడ్లు ఇతర పథకాలపై గ్రామ సభలో తీర్మాణాలు చేయడం జరుగుతుందని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా సురేంద్ర



నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్‌గా విశాఖ జీవీఎంసీలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జె.సురేంద్రను నియమిస్తూ మున్సిపల్, పట్టణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింగల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత కమిషనర్ పూడి రవిబాబును మున్సిపల్‌శాఖ డైరెక్టరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గతంలో సురేంద్ర నర్సీపట్నం కమిషనర్‌గా పని చేశారు. రెండు, మూడు రోజుల్లో ఆయన విధుల్లో చేరుతారని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

జెడ్పీ స్కూల్‌కు మైక్రోస్కోప్ వితరణ



పాఠశాల హెచ్ఎంకు మైక్రోస్కోప్ అందజేస్తున్న ఏసీటీవో గోవిందరావు

నర్సీపట్నం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తురకబడి)కు ఏసీటీవో వియ్యపు గోవిందరావు రూ.2 వేలు విలువ చేసే డిజిటల్ మినీ మైక్రోస్కోప్‌ను వితరణగా అందజేశారు. గురువారం హెచ్ఎం దాసరి దైవప్రసాద్, సైన్స్ టీచర్ ఐ.శ్రీనివాస్‌కు అందజేశారు. దాతలు అందించిన సహకారంతో విద్యార్థులు సద్వినియోగం చేసుకోని, విద్యలో రాణించాలని సైన్స్ టీచర్ శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రోలుగుంట: సుబ్బాయుడుపాలెం, రోలుగుంట ఫీడర్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నర్సీపట్నం డివిజన్ ఈఈ రామకృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపా రు. 33/11 కేవీ రోలుగుంట విద్యుత్ ఉపకేంద్రం సుబ్బారాయుడు ఫీడర్ పరిధిలోని రొంగలపాలెం, జె.పి.అగ్రహారం, సుబ్బారాయుడుపాలెం, జానకీరాంపురం, అప్పనదొర పాలెం, తానారిపాలెం, రోలుగుంట ఫీడర్ పరిధిలోని రోలు గుంట, సన్‌ఫుడ్, ఓలం జీడిపిక్కల పరిశ్రమల్లో ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని తెలి పారు.

దేవరాపల్లి : దేవరాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పెదనందిపల్లి ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నర్సీపట్నం ఈఈ రామకృష్ణ తెలిపారు. లైన్ మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున పెదనందిపల్లి, చిననందిపల్లి, కాశీపురం, నాగయ్య పేట, తామరబ్బ, చింతలపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

కూరల సాగు బహు బాగు

- ఏడాది పొడవునా రైతుకు ఆదాయం
- పెట్టుబడులు, కూలీల ఖర్చు తక్కువ
- పెరుగుతున్న సాగు విస్తీర్ణం



రోలుగుంటలో పండిన బీర పాదు

రోలుగుంట : మండలంలో పలు గ్రామాల్లో రైతులు కూరగాయల సాగుపై దృష్టి సారించారు. వాస్తవంగా ఈ మండలంలో వర్షాధారంగా పంటలు పండిస్తారు. అయితే వర్షాలు సకాలంలో కురవక వరి, చెరకు పంటలు కలిసి రాక రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. అయితే అతివృష్టి, లేకుంటే అనావృష్టి. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు.

మండలంలో 950 హెక్టార్లలో.. మండలంలో



జానకీరామపురంలో పండిస్తున్న బెండతోట



భారీసైజులో ఉన్న బీరకాయ

కుసుర్లపూడి, జానకీరాంపురం, కొమరవోలు, భోగాపురం. కొంతలం, శరభవరం, బుచ్చింపేట, రత్నంపేట, కొండపాలెం, రొలుగుంట, తదితర గ్రామాల్లో బీర, వంగ, బెండ, గోంగూర, కూర బొబ్బరి, తదితర రకాల కూరగాయలు, ఆకుకూరలు సుమారు 950 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతులు బెండ సాగుకి ఎకరా విస్తీర్ణంలో సుమారు మూడు దఫాలు భూమి దుక్కు చేసినందుకు గాను రూ.3,500, అలాగే పాడి గెత్తంకు రూ.900 కిలో విత్తనాలకు సుమారు రూ. 850, వెరసి రూ.6,200 వరకూ అవుతుంది. రెండు నెలల్లోనే పంట చేతికి వస్తుంది. మూడురోజుల కోసారి సుమారుగా 300 నుంచి 350 కిలోల బెండకాయలు పండుతాయి. ప్రస్తుతం కిలో రూ.40 విక్రయాలు జరుగుతున్నాయి. డిమాండును బట్టి ఎపుడూ ధర మెరుగ్గానే ఉంటుంది. పండిన పంటను పట్టణ ప్రాంతాలకు నర్సీపట్నం, కొత్తకోట మాకవరపాలెం తీసుకెళ్లి టోకుగా అమ్మకాలు జరుపుతారు. ఈ పంట మూడు నెలల పైబడి ప్రతి మూడు రోజులకు ఆదాయం వస్తూనే ఉంటుంది. అయితే చీడపీడలు ఆశించకుండా వ్యవసాయ సూచనలు పాటిస్తారు. కూలీల కోసం ఎదురు చూసే పని లేదని, కుటుంబ సభ్యులతో కలిసి సాగు చేస్తే ఖర్చు కలిసి వస్తుందని రైతులు



బుచ్చింపేటలో పండిస్తున్న వంగతోట

చెబుతున్నారు. మండలంలో బీర పాదులతో పాటు వంగ, గోంగూర కూర బొబ్బరి, మిశ్రమ పంటలు వేస్తున్నారు. వంగ కావడికి 30 కిలోలు వస్తాయి. వీటి ధర నిలకడగా ఉండదు. బీరకాయల ధరకు మాత్రం డోకా ఉండదు.

రెండెకరాల్లో సాగు చేస్తున్నా...



కూలీల కోసం వేచి చూసే పని లేదు. కుటుంబంలో వారికి పని సరిపోతుంది. రెండెకరాల్లో కూరగాయలు పండిస్తున్నాను. పెట్టుబడులు పోను లాబం మెరుగ్గా ఉంటుంది. స్వల్ప పెట్టుబడులు సరిపోతాయి. కొంత అప్పు చేసినా మొదటి ఆదాయంలోనే అప్పు తీర్చేయొచ్చు. కుటుంబం అంతా ఆడుతా,పాడుతా పని చేసుకుంటాం. పెద్ద కష్టం ఉండదు.

–టి.నర్సింహమూర్తి, రైతు, రోలుగుంట

నీటి వసతి ఉండాలి



కూరగాయల సాగు ఏడాది పొడవునా ఉంటుంది. ఖరీఫ్‌లో అయితే వర్షాల తడులు సరిపోతాయి. వేసవిలో నీటి వసతి కావాలి. నీటి తడులు కావాలి. లేకుంటే పంట ఏపుగా ఎదగకుండా మాడిపోతాయి. వీటిని బోర్లు, నీటి ఇంజిన్ల ద్వారానే సంరక్షించుకోవాలి.

–కాగితం సింహాచలం, రైతు, రోలుగుంట

సమస్యలు తీర్చని సమావేశాలెందుకు?



మంచినీటి సమస్యపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచ్ శ్రీను

బుచ్చెయ్యపేట : మూడు నెలలుకొకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశంలో చెప్పిన సమస్యలు పరిష్కారం కానపుడు మండల సమావేశాలు నిర్వహించడమెందుకని పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు అధికారులపై ధ్వజమెత్తారు. గురువారం ఎంపీపీ దాకవరపు నాగేశ్వరి దేవి అధ్యక్షతన బుచ్చెయ్యపేట మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. 35 పంచాయతీ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు,ఆయా శాఖల అధికారులు మండల సమావేశానికి హాజరయ్యారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇంటింటి కుళాయి నిర్మాణాల్లో భాగంగా మంచినీటి ట్యాంకులు, పైపులైన్‌లు ఏర్పాటు, పైపులు లీకేజీలు సరిచేయాలని పదే పదే చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడంపై పోలేపల్లి, సీతయ్యపేట, విజమరామరాజుపేట, వడ్డాది, దిబ్బిడి, ఐయితంపూడి, మంగళాపురం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సీతా బుజ్జి, వబ్రపు శ్రీను, ఎల్లపు విజయ్ కుమార్, దొండా లలితా నారాయణమూర్తి, కంటే పద్మరేఖ వెంకట్, కోరుకొండ రమణ, పెద్దాడ నాయుడు, పెదిరెడ్ల మాణిక్యం ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ హరీష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం పనులు చేపట్టి మంచినీళ్లు అందించాలని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరిపడా వరి విత్తనాలతో పాటు ఎరువులు సరఫరా చేయకపోవడంతో చాలా మంది రైతులు ప్రైవేటు విత్తన వ్యాపారులను ఆశ్రయించి ఎక్కువ ధరకు కొనుగోలు చేశారని ప్రభుత్వం నుంచి అందే సబ్సిడీ విత్తనాలు, ఎరువుల సరఫరా చేయకపోవడంపై మండల వ్యవసాయాధికారి భాస్కరరావుపై వైస్ ఎంపీపీ, పోలేపల్లి సర్పంచ్‌లు దొండా లలితా నారాయణమూర్తి, సీతా బుజ్జిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటి నిర్మాణ పేమెంట్లు, పాఠశాలకు గదులు నిర్మాణానికి నిధులు మంజూరు, అంగన్‌వాడీ భవనాల ఏర్పాటుపై పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు ఆయా శాఖల అధికారులను ప్రశ్నించారు. సోలార్ విద్యుత్ ఏర్పాటుకు మండలంలో 15 ఎకరాలు స్థలం కావాలని, భూములను లీజుకిచ్చే రైతులు ముందుకు రావాలని ఏఈ రాజు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత మొదటిసారి జరిగే మండల సమావేశానికి ఎమ్మెల్యే హాజరుకాకపోగా పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీల స్థానంలో సూపర్‌లు హాజరయ్యారు. ఎంపీడీవో సువర్ణరాజు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీవో ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సత్యవరంలో ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం



సత్యవరంలో పశువులకు ఉచితంగా చికిత్స చేస్తున్న వైద్యుడు

మాడుగుల : సత్యవరం గ్రామంలో జిల్లా పశుగాణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో 26 గర్భకోశ వ్యాధులకు 18 ఎదకు రాని పశువులకు, 16 చూడిపరీక్షలు, 14 పెయ్యిలకు నట్టనివారణ మందులు, 96 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, 18 పశువులకు సాధారణ చికిత్సలు అందజేశారు. 20 మంది పాడి రైతులకు మినరల్ మిక్చర్ పాకెట్లతో పాటు లివర్‌టానిక్‌లు పంపిణీ చేశారు. దూడ పెయ్యిలు మరణాల నివారణపై, రూ.500కే లింగనిర్ధారణ వీర్యం, పశు బీమా, సంచారపశు, ఆరోగ్య, సేవలు గురించి పాడేరు డివిజన్ ఉప సంచాలకుడు సీహెచ్.నరసింహులు, మాడుగుల ఏడీ వి.చిట్టినాయుడు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు అరుణ్ కిరణ్, గాయత్రి, మణి, లక్ష్మణ్, చంద్రరావు, బాబ్జి, కృష్ణారావుతో పాటు సర్పంచ్ జెర్రిపోతుల నాగమణి, ఎంపీటీసీ తలారి అప్పారావు పాల్గొన్నారు.

ఉపాధి గ్రామసభలను నిర్వహించాలి



కె.కోటపాడులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఏపీవో అప్పలరాజు

కె.కోటపాడు : మండలంలో 32 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఉపాధి గ్రామసభలను నిర్వహించాలని ఎంపీడీవో ఎస్.అప్పలరాజు తెలిపారు. ఉపాధి గ్రామసభలకు నియమించిన ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశంను నిర్వహించారు. ప్రతి గ్రామంలోను కచ్చితంగా గ్రామసభను జరపాలని ఆయన సూచించారు. సమావేశంలో ఏపీవో అప్పలరాజు మాట్లాడుతు 2024-25, 2025-26 కాలాలకు సంబంధించి గ్రామాల్లో ఉపాధి నిధులతో చేపట్టిన పనులు, చేపడుతున్న పనులను ప్రజలకు వివరించడంతో పాటు రాబోయే కాలంలో చేపట్టాల్సిన ఉపాధి పనులను గ్రామసభలో గుర్తించాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో ఉపాధి నిధులతో చేపట్టనున్న 86 రకాలైన పనులపై ప్రజలకు గ్రామసభలో వివరించాలని సూచించారు. సమావేశంలో పంచాయితీ విస్తరణాదికారి ప్రసాద్ పాల్గొన్నారు.

గెడ్డ భూమిలో హెచ్చరిక బోర్డులు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన వీఆర్వో లక్ష్మణరావు

మాకవరపాలెం: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని 68 సర్వే నంబర్‌లో గెడ్డ పోరంబోకు భూమిని ఆక్రమించుకుని, నిర్మాణాలు చేసేందుకు సిద్ధం చేస్తున్నారంటూ స్పందనలో ఫిర్యాదు చేయడంతోపాటు హై కోర్టులో పబ్లిక్ ఇంట్రస్ట్ లిటికేషన్(పిల్) దాఖలైంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో గురువారం 68 సర్వే నంబర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం పక్కనే ఉన్న ఖాళీ స్థలంతోపాటు మరోచోట ఖాళీగా ఉన్న స్థలంలో వీఆర్వో లక్ష్మణరావు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

టీకాతో గాలికుంటు నివారణ

కె.కోటపాడు : పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు టీకా ఒక్కటే మార్గమని కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు అన్నారు. పోతనవలస, డి.అగ్రహారం, కొరువాడ గ్రామాల్లో గురువారం 350 పశువులకు గాలికుంటు టీకాలను వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. గాలికుంటు వ్యాధి బారిన పడిన పశువులు ఈసుకుపోయే పరిస్థితిని ఎదుర్కోవడంతో పాటు ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గే పరిస్థితి కలగనున్నట్టు పశువైద్యాధికారి నాయుడు రైతులకు వివరించారు. టీకాలను పశువులకు వేయడం వల్ల వ్యాధి సోకిన పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గకుండా చర్యలు తీసుకోవడం, దూడల్లో మరణాలు లేకుండా చేయడంతో పాటు ఆరోగ్యంగా ఎదిగే పరిస్థితి టీకాల వల్ల కలగనున్నట్టు ఆయన తెలిపారు. రైతులు తప్పకుండా పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలను వేయాలని పశువైద్యాధికారి నాయుడు సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వరలక్ష్మి, దేముడుబాబు, ఆదర్శ్, హనుమంతు పాల్గొన్నారు.

పడగ విప్పిన వైరల్ జ్వరాలు

రోగులతో నిండిపోయిన ప్రభుత్వాస్పత్రి



మాడుగుల ప్రభుత్వాసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సంతోష్‌కుమార్



మాడుగుల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

మాడుగుల : ఏజెన్సీకి ముఖ ద్వారమైన మాడుగుల మండలంలో వైరల్ జ్వరాలు పడగ విప్పాయి. మండలంలో గల 29 పంచాయతీల్లో జ్వరపీడితులు రోజురోజుకు పెరుగుతున్నారు. ఆసుపత్రిలో జనరల్ వార్డులు, చిన్నపిల్లల వార్డులు జ్వర పీడితులతో నిండిపోయాయి. రోజుకు 120 నుండి 200 వరకూ జ్వరాలతో ఆస్పత్రికి వస్తున్నారు. జ్వర తీవ్రత అధికంగా ఉన్నవారిని ఆస్పత్రిలో చేర్చుకుని వైద్యం అందిస్తున్నారు. రక్త పరీక్షలు నిర్వహించిన వారికి మలేరియా, టైఫాయిడ్‌లు, నెగిటివ్ అని రిపోర్టులు వస్తున్నాయి. కానీ జ్వరాలు మాత్రం వారం రోజుల వరకు తగ్గుముఖం పట్టలేదని బాధితులు ఆందోళన చెందుతున్నారు. గురువారం కూడా సుమారు 200లకు పైగా మాడుగుల 30 పడకల ఆసుపత్రి జ్వరాలతో రోగులు వచ్చారు. ఈ విషయమై వైద్యాధికారి సంతోష్ కుమార్‌ను సంప్రదించగా ఏజెన్సీ గ్రామాలు కూడా మాడుగుల ఆసుపత్రిపై ఆధారపడి ఉండడంతో వైరల్ జ్వరాలు తీవ్రత అధికంగా ఉండడం వాస్తవమేనని, ఆసుపత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కాచి చల్లార్చిన నీరు తాగడం వల్ల జ్వరాలు అదుపు చేయవచ్చన్నారు.

ఉపాధి పనుల్లో మార్పులు చేయాలి



ఇన్‌చార్జి ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు

మాడుగుల : గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మార్పులు చేయాలని, ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్‌కు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కార్లి భవానీ గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ నెల 23 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న, గ్రామ సభల్లో కూలీలకు ఉపయోగపడే విధంగా పనులు చేర్చాలని, రోడ్లు, శ్మశాన వాటికలు, చెరువులు వంటి వాటిని గుర్తించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించుకుంటూ వస్తుందని, రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం కూడా స్పందించి గ్రామ సభల్లో కూలీలకు ఉపయోగపడే పనులు గుర్తించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా కార్యదర్శి ఇరటా నరసింహామూర్తి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించేలా చూడాలి



ఎంఈవో కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నర్సీపట్నం : సమయపాలన పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంఈవో కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ గీతాకృష్ణ, సభ్యులు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సమయాన్ని పాటిస్తూ పాఠశాలలను నడపాల్సి ఉండగా, ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పాఠశాలల్లో ఉంచి విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. కాంప్లెక్స్‌కు వచ్చేనరికి బస్సులు లేక వారు రాత్రి 9 గంటలకు ఇళ్లకు చేరుతున్నారన్నారు. సెలవు దినాల్లో పాఠశాలలను నడపడం వల్ల పాస్‌లు పని చేయక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అందువల్ల పాఠశాలలు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పశువులు, నాటుకోళ్ల షెడ్ల ఏర్పాటుకు ప్రభుత్వ రాయితీ

రోలుగుంట : పశువులు, నాటుకోళ్ల వసతి కోసం షెడ్లు నిర్మాణానికి అయ్యే పెట్టుబడికి ప్రభుత్వం రాయితీ ఇస్తుందని పశువైద్యాధికారి నూకేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. అందుకోసం మండలంలో గల ప్రతి సచివాలయాల పరిధిలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. పాడి పశువులకు 10 శాతం రాయితీ, గొర్రెలు. మేకలు మరియూ నాటుకోళ్లకు 30 శాతం రాయితీ కల్పిస్తున్నారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు ఇతర వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల సొంత స్థలాల్లో నిర్మించుకునే పద్ధతిన ఈ రాయితీ కల్పించడం జరుగుతుందని, అందుకోసం శుక్రవారం నిర్వహించనున్న సభల్లో ఆసక్తి ఉన్న వారు పాల్గొని ఈ అవకాశం వినియోగించుకోవాలని ఆయన కోరారు.